సాక్షి కామారెడ్డి
మంగళవారం ♦ 31 ♦ జనవరి ♦ 2023



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్ వినతులు స్వీకరించారు.

- 8లో ▸



రసవత్తరంగా ఎస్‌పీఎల్

నిజామాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ రసవత్తరంగా కొనసాగుతోంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /14.5

వాతావరణం

పొగ మంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కాస్త తగ్గవచ్చు.

న్యూస్‌రీల్

'అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతాం'



కామారెడ్డి టౌన్ : అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. దేవునిపల్లిలో రూ. 4 కోట్ల 30 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. రూ. 2 కోట్ల 77 లక్షలతో వాటర్ ట్యాంక్, రూ.కోటితో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.44 లక్షలతో నిర్మించిన అదనపు భవనం, ప్రైమరీ పాఠశాలలో రూ.11 లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



కామారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం జిల్లాలో 44 శిబిరాలను ఏర్పాటు చేసి 5,639 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 886 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 314 క్యాంపులను నిర్వహించి 37,986 మందికి కంటి పరీక్షలు చేశామని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. 8,190 మంది కంటి అద్దాలను అందించామన్నారు. పట్టణాలు, గ్రామాల్లో జరిగే క్యాంపులకు హాజరై కంటి పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన డీఎస్పీ



కామారెడ్డి క్రైం: కామారెడ్డి డీఎస్పీగా నియమితులైన వీపూరి సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో బాసర ట్రిపుల్ ఐటీ డీఎస్పీగా పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా కామారెడ్డికి వచ్చారు. కాగా ఇక్కడ పని చేసిన డీఎస్పీ సోమనాథం హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ సురేష్ మాట్లాడారు. నేరాల నియంత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

'పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి'

కామారెడ్డి టౌన్: పోస్టల్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి ఐపీవో శ్రావణ్ కుమార్ కోరారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని పోస్టల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పొదుపు పథకాల వడ్డీ రేట్లను ప్రభుత్వం పెంచిందన్నారు. సేవింగ్స్ అకౌంట్‌లలోని నిల్వలపై 4 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. రికరింగ్ డిపాజిట్‌లపై 5.8 శాతం చెల్లిస్తున్నామన్నారు. టైం డిపాజిట్‌లలో ఏడాదికి 6.6 శాతం, రెండేళ్లకు 6.8 శాతం, మూడేళ్లకు 6.9 శాతం, ఐదేళ్లకు 7 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. ప్రతి నెల ఆదాయం స్కీం అకౌంట్‌కు సంబంధించి 7.1 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లపై 7 శాతం, కిసాన్ వికాస్ ఖాతాలకు 7.2 శాతం, సీనియర్ సిటిజన్ అకౌంట్‌లకు 8 శాతం, సుకన్య సమృద్ధి ఖాతాలకు 7.6 శాతం, పీపీఎఫ్ అకౌంట్‌కు 7.1 శాతం వడ్డీ లభిస్తుందని తెలిపారు. గ్రామీణ తపాలా జీవిత బీమాతో తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ లభిస్తుందని, ఈ అవకాశాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

ఇద్దరు జిల్లా స్థాయి అధికారుల బదిలీ

కామారెడ్డి క్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు సోమవారం బదిలీ అయ్యారు. మైనింగ్ శాఖ ఏడీ నర్సిరెడ్డిని హన్మకొండ జిల్లా ఏడీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నిర్మల్ జిల్లా ఏడీగా పనిచేసిన క్రాంతికుమార్ రానున్నారు. కామారెడ్డి సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం జితేంద్ర ప్రసాద్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లాకు పంపించారు. ఆయన స్థానంలో నిజామాబాద్ డీఎం అభిషేక్‌ను బదిలీ చేశారు.

స్థాయి ఉన్నా.. సేవలు సున్నా!



ఆస్పత్రిలో వైద్యులరాక కోసం ఎదురుచూస్తున్న రోగులు (ఫైల్)



సర్కారు దవాఖానాల్లో సేవలు నామమాత్రంగా అందుతున్నాయి. ఓవైపు వైద్యుల కొరత వేధిస్తుండగా.. మరోవైపు ఉన్న సిబ్బందీ సమయ పాలన పాటించడం లేదు. దీంతో సరైన వైద్యం అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

- దోమకొండ సీహెచ్‌సీలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- మధ్యాహ్నం 12 దాటితే ఆస్పత్రిలో కనిపించని డాక్టర్లు
- డ్రైవర్ లేకపోవడంతో వృథాగా ఉంటున్న అంబులెన్స్
- సరైన వైద్యం అందక ఇబ్బందిపడుతున్న రోగులు

దోమకొండ: దోమకొండలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 2008లో రూ.1.96 కోట్లతో 30 పడకల ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. 2010లో అప్పటి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దానం నాగేందర్ ప్రారంభించారు. అయితే భవన నిర్మాణానికి నిధులిచ్చిన సర్కారు.. వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీపై మాత్రం శ్రద్ధ చూపలేదు. దీంతో రోగులకు సరైన సేవలు అందడం లేదు.

పోస్టులు ఖాళీ..

దోమకొండ సీహెచ్‌సీలో డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు నాలుగు ఉండగా.. ఒక్కరూ లేరు. 11 మంది అసిస్టెంట్ సివిల్ సర్జన్‌లకుగాను ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఇద్దరు హెడ్ నర్సులు అవసరం ఉండగా ఒక్కరే విధుల్లో ఉన్నారు. ఆస్పత్రిలో 10 స్టాఫ్ నర్స్ పోస్టులుండగా.. మూడు పోస్టు లు ఖాళీగా ఉన్నాయి. ఒక రేడియోగ్రాఫర్, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఒక ఫార్మసిస్ట్ సేవలందిస్తున్నారు. ల్యాబ్ టెక్నిషియన్‌ను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. రెండు డార్క్‌రూం అసిస్టెంట్ పోస్టులుండగా.. ఒకరు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచే స్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగానే ఉంది. ఆస్పత్రిలో అంబులెన్స్ ఉన్నా.. డ్రైవర్ లేకపోవడంతో వృథాగా ఉంటోంది. ఇలా ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆస్పత్రిలో సరైన సేవలు అందడం లేదు. దీంతో అత్యవసర కేసులను జిల్లాకేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేయాల్సి వస్తోంది.

మధ్యాహ్నం 12 గంటలు దాటితే..

ఓవైపు ఆస్పత్రిలో చాలావరకు పోస్టులు ఖాళీగా ఉండడంతో రోగులకు సరైన సేవలు అందడం లేదు. మరోవైపు ఉన్న వైద్యులు, సిబ్బంది కూడా సమయ పాలన పాటించడం లేదు. మధ్యాహ్నం 12 గంటలు దాటితే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

మాన్యువల్ ఎక్స్‌రేనే..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డిజిటల్ ఎక్స్‌రే మిషన్లు అందుబాటులో ఉన్నాయి. కానీ దోమకొండలో మాత్రం మాన్యువల్ ఎక్స్‌రే విధానాన్నే వినియోగిస్తున్నారు. డిజిటల్ ఎక్స్‌రేను అందు బాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేసి సేవలను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు. ఐసీటీసీ సెంటర్ కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు దోమ కొండలోని 30 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు ఈ విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం కూడా ఇచ్చారు.

వైద్యులు ఉండేలా చూడాలి



దోమకొండ ఆస్పత్రిలో వైద్యులు మధ్యాహ్నం 12 గంటల తర్వాత అందుబాటులో ఉండడం లేదు. అత్యవసర వైద్యం కోసం ఎప్పుడూ కామారెడ్డికి పంపుతున్నారు. దీంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలి.

– సాయికుమార్, దోమకొండవాసి

24 గంటలపాటు..



మండలకేంద్రంలోని ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. ఈ విషయమై ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో పాటు, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మితో మాట్లాడాను. ఇక్కడ వైద్యులను నియమించి 24 గంటల పాటు నిరంతరాయంగా సేవలందేలా చూడాలని కోరాం.

– తీగల తిర్మల్‌గౌడ్, జెడ్పీటీసీ, దోమకొండ

బదిలీల దరఖాస్తు గడువు పొడిగింపు

- రేపటివరకు అవకాశం

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. బదిలీల షెడ్యూల్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ముందుగా ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ప్రస్తుతం గడువు పొడిగించిన సర్కారు.. బుధవారం వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది.

ఇప్పటికే 219 పీజీ హెచ్‌ఎం, 1,400లకు పైగా స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. సర్టిఫికెట్లను అధికారులు పరిశీలిస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు మెడికల్‌కు సంబంధించిన నకిలీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పరిశీలన అనంతరం అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అయితే మెడికల్ బోర్డు, వైద్యుల పర్యవేక్షణలో మెడికల్ సర్టిఫికెట్‌లను పరిశీలించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



టీచర్ల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఖాళీల జాబితా ఏదీ?

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు, సీనియారిటీకి సంబంధించిన జాబితాను షెడ్యూల్ ప్రకారం ఈనెల 27నే ప్రదర్శించాల్సి ఉంది. కానీ ఇప్పటికీ ప్రకటించలేదు. దీంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. పూర్తి స్థాయిలో సీనియారిటీ, ఖాళీల వివరాలను ప్రకటించాకే పారదర్శకంగా బదిలీలు, పదోన్నతులు జరపాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

పెర్కిట్ (ఆర్మూర్): సీఎం కేసీఆర్ ప్రజావ్యతిరేక విధానాల వల్ల తెలంగాణలో అరాచక పాలన సాగుతోందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో సోమవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల రైతులు, పేదలు చివరకు ప్రజాప్రతినిధులు ఆత్మహత్యలకు పాల్పడవలసిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. అభివృద్ధితో కాకుండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, ఇతర పార్టీల మధ్య చిచ్చులు పెడుతూ మరోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పావులు కదుపుతున్నాడన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందకుండా చేస్తోందని విమర్శించారు. 2018 సంవత్సరంలో ఎన్నికల సందర్భంగా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తానన్న కేసీఆర్ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఏసీడీ పేరుతో రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు వేస్తూ రాష్ట్ర ప్రజలపై భారం మోపుతున్నాడన్నారు. ప్రత్యేక రాష్ట్రంతో కష్టాలు తీరుతాయనుకున్న తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. బంగారు తెలంగాణ బీజేపీ వల్లనే సాధ్యమవుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనతో విసుగు చెందిన నాయకులు రానున్న రోజుల్లో బీజేపీలో భారీ స్థాయిలో చేరతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, వినయ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జీవీ నర్సింహారెడ్డి, భూపతిరెడ్డి, పోతంకర్ లక్ష్మీ నారాయణ, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, దినేష్ కులాచారి, జెస్సు అనిల్, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పోడు పట్టాల పంపిణీ..



గిరిజనాభివృద్ధి శాఖ మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పాటిల్, జిల్లా అధికారులు

- అర్హులందరికీ న్యాయం చేయాలి
- వీసీలో గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

కామారెడ్డి క్రైం: త్వరలో అర్హులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేయనున్నట్లు గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఆమె అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు, మన ఊరు –మన బడి, పోడు భూములు, పామాయిల్, టీచర్ల బదిలీలు, జీవో నంబర్లు 58, 59 లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పోడు భూముల సమస్యకు సంబంధించి ఇప్పటికే క్షేత్ర స్థాయిలో సర్వే, గ్రామ సభలు పూర్తయ్యాయన్నారు. ఫిబ్రవరిలో పోడు భూములకు పట్టాల పంపిణీ ఉంటుందన్నారు. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలవారీగా మరోసారి సమీక్షించుకుని అర్హులందరికీ న్యాయం చేయాలన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీ అనంతరం ఒక్క అడుగు భూమి కూడా ఆక్రమణకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కలెక్టర్‌లను ఆదేశించారు.

27,482 దరఖాస్తులు..

జిల్లాలో పోడు భూముల కోసం 27,482 మంది దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. గ్రామ సభల ద్వారా ఎస్టీ లబ్ధిదారులు 9,531 మందిని, గిరిజనేతరులు 12,568 మందిని గుర్తించామని పేర్కొన్నారు. వీసీలో కామారెడ్డి నుంచి అదనపు కలెక్టర్‌లు చంద్రమోహన్, వెంకటేశ్ ధోత్రే, డీఎఫ్‌వో నిఖిత, డీఈవో రాజు, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల జనాభాను నియంత్రించాలి

కామారెడ్డి క్రైం: కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించి వాటి జనాభాను తగ్గించే దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జిల్లా జంతు సంరక్షణ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు పట్టుకున్న పశువులు ఉంచేందుకు ప్రత్యేక స్థలం కేటాయించాలన్నారు. గోశాలల్లోని పేడను ఉపయోగించి గోబర్ గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గోశాలలకు వసతులు కల్పించాలని, మందులను ఇవ్వాలని పశు వైద్యాధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీటీవో వాణి, జిల్లా పశువైద్యాధికారి భరత్, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, పశు వైద్యాధికారులు సంజయ్, భాస్కర్, దేవేందర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'పావలా వడ్డీ' నిధులివ్వాలి

- లేకపోతే నిరశన దీక్షకు సిద్ధం
- బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు/రాజంపేట: మహిళా సంఘాలకు రావాల్సిన పావలా వడ్డీ రాయితీని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. లేకపోతే నిరవధిక నిరాహార దీక్ష చేపట్టడానికీ వెనుకాడనని హెచ్చరించారు. పావలా వడ్డీ రాయితీకి సంబంధించిన నిధులు విడుదల చేయాలన్న డిమాండ్‌తో మహిళా సంఘాల సభ్యులు సోమవారం రాజంపేట, భిక్కనూరు మండల కేంద్రాలలో భారీ ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను సీఎం కేసీఆర్ నీరుగార్చారని ఆరోపించారు. గతంలో అభయహస్తం పథకం కింద మహిళా సంఘాలకు ఎంతో మేలు జరిగేదన్నారు. దానిని సీఎం ర ద్దు చేశారన్నారు. ఐదేళ్లుగా పావలా వడ్డీ రాయితీని కూడా విడుదల చేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే మహిళలకు బకాయి డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఫిబ్రవరి 9న కామారెడ్డిలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

భిక్కనూరులో ప్రధాన వీధులగుండా ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో అరగంటపాటు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. రాజంపేటలో పెద్దమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు సాగింది. అనంతరం ఎంపీడీవో బాలకిషన్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమాలలో బీజేపీ భిక్కనూరు, రాజంపేట మండలాల ధ్యక్షులు రమేశ్‌రెడ్డి, గంగారెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింలు, భూపాల్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి, విష్ణు, రమేశ్, ఏకనాథ్, బాల్‌లింగం, నారాయణ, పిట్ల శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, రాము, సంధ్య బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరు ర్యాలీలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు



రాజంపేటలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

సాధు సమ్మేళనం.. భక్తజన సందోహం

- పలుగుట్ట శ్రీ కేదారేశ్వరాశ్రమానికి పోటెత్తిన భక్తులు
- దేశంలోని ప్రసిద్ధ పీఠాధిపతులు హాజరు
- మంగి రాములు మహరాజ్ ఆధ్వర్యంలో సమ్మేళనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నందిపేట పలుగుట్ట శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో అఖిలాంధ్ర సాధుసంతుల పరిషత్ మహాసభల నేపథ్యంలో భక్తజన సందోహం పోటెత్తింది. ఈనెల 27న ప్రారంభమైన ఈ మహాసభల్లో దేశంలోని వివిధ ప్రసిద్ధ ప్రాంతాల నుంచి పీఠాధిపతులు పాల్గొంటున్నారు. సోమవారం హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి, మంగి రాములు మహరాజ్‌ల ఆధ్వర్యంలో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. తర్వాత ఆలయ శిఖరంతో పాటు శివుడి విగ్రహానికి అభిషేకం చేశారు. ఇక తెల్లవారుజామున అయోధ్య నుంచి వచ్చిన 25 మంది సాధువులు గోఉత్పత్తులతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి సమ్మేళనానికి తరలివచ్చిన భక్తులకు అల్పాహారం, అన్నదానం నిరంతరం కొనసాగుతున్నాయి.



ప్రవచనామృతాన్ని అందిస్తున్న హంపీ పీఠాధిపతి

■ హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి మాట్లాడుతూ హిందూధర్మ పరిరక్షణే సాధు పరిషత్ ముఖ్య ఉద్దేశమన్నారు. హిందూ జీవన విధానం సూక్ష్మమైనదని పేర్కొన్నారు. సుఖం, భోగం కోసం కాకుండా యోగం కోసం బతకాలని సూచించారు. సనాతన ధర్మాన్ని పునరుద్ధరించడం కోసం సామరస్యపూర్వక సమాజాన్ని నెలకొల్పాల్సి ఉందన్నారు. ప్రజలందరూ ధర్మమార్గంలో నడవాలన్నారు. ప్రాచీనమైన వేద విజ్ఞానం చాలా గొప్పదన్నారు.

■ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఇంత పెద్ద గొప్ప కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందన్నారు. ఇందులో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు.

■ సమ్మేళనానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. ఇంత మంచి సమ్మేళనం ఇక్కడ నిర్వహించడం గొప్పవిషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో సమాజానికి మంచి శ్రేయస్సు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి పాల్గొన్నారు.

ఫ్లాట్ ఫర్ సేల్
ఎల్లారెడ్డి పట్టణంలో 1000 యార్డ్స్ మెయిన్ రోడ్ మెదక్ వెళ్లేటప్పుడు లెఫ్ట్ సైడ్‌లో కమర్షియల్ జాగ అమ్మకానికి ఉంది. పూర్తిగా కంపౌండ్ వాల్ సౌకర్యం కలదు. LRS సౌకర్యం కూడా కలదు.
సంప్ర: 9963913786

క్లుప్తంగా

నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్‌లు చేయాలి




ఆర్మూర్: నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్‌లు నిర్వహించాలని జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్ సూచించారు. ఆర్మూర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ అశీఫిద్దిన్‌కు పలు సూచనలిచ్చారు.

యూత్ పార్లమెంట్ విజేతల ప్రకటన

నిజామాబాద్‌నాగారం: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆన్ లైన్ ద్వారా నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీల విజేతలను సోమవారం జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్ ప్రకటించారు. నిజామాబాద్ జిల్లాలో మొదటి స్థానంలో అక్షిత, రెండో స్థానంలో శ్రీజ జాదవ్, కామారెడ్డి జిల్లాలో మొదటి స్థానం మౌనిక, రెండో స్థానంలో రాగవర్శిని నిలిచారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కేశవ్ కుమార్, వినయ కుమార్, మోహన్ దాస్, హర్ష రాథోడ్, రవీందర్ రెడ్డి వ్యవహరించారు.

వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన



బీబీపేట: బీబీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ అటెండర్ అరుణ్ జీతాలు పెంచాలని కోరుతూ సోమవారం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. తక్కువగా ఉండడంతో కుటుంబాల పరిస్థితి దీనంగా తయారైందని, ఉన్నతాధికారులు స్పందించి జీతాలు పెరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎస్సై సాయికుమార్ అతనికి నచ్చజెప్పి కిందికి దింపారు.

కోర్టులో కంటి వెలుగు ప్రారంభం



ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో కంటివెలుగు కార్యక్రమాన్ని జిల్లా జడ్జి సునీత కుంచాల సోమవారం ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్నారు. కోర్టు పరిధిలోని సిబ్బంది, న్యాయవాదులు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సోమవారం 200 మంది సిబ్బంది, న్యాయవాదులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్ తదితరులు ఉన్నారు.

రేపు మన ఊరు-మన బడి పాఠశాలల ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం మన ఊరు- మన బడి కార్యక్రమం ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలో 407 పాఠశాలలను ఎంపిక చేశారు. ప్రస్తుతం 17 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. బుధవారం ఈ పాఠశాలలను ప్రారంభించనున్నారు.

టేకు కలప పట్టివేత

సిరికొండ: మండలంలోని తాటిపల్లి బీట్ అటవీ ప్రాంతంలో అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న టేకు కలపను పట్టుకున్నట్లు సిరికొండ సెక్షన్ అధికారి గంగారం సోమవారం తెలిపారు. ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇరవై టేకు దుంగలను పోలీసుల సహకారంతో పట్టుకొని సీజ్ చేశామన్నారు. పట్టుకున్న టేకు కలప విలువ రూ.6599 ఉంటుందన్నారు. వెంకటస్వామి అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

రసవత్తరంగా ఎస్‌పీఎల్

నేడు సెమీ ఫైనల్స్, ఫైనల్





బ్యాట్స్‌మన్ అవుట్ కావడంతో ఆనందంలో క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. టోర్నీలో భాగంగా సోమవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. మంగళవారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ పల్లె మహేష్, కోచ్ పారస్, అంపైర్లు షారుఖ్, దుర్గాప్రసాద్, స్కోరర్ నయూమ్, గ్రౌండ్స్‌మన్ కె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

8 వికెట్లతో గెలిచిన 'సాందీపని'

జీజీ కళాశాల, సాందీపని డిగ్రీ కళాశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో సాందీపని జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన జీజీ కళాశాల పది ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 40 పరుగులు చేసింది. సాందీపని జట్టు 6.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

గెలుపొందిన గౌతమి కళాశాల

రెండో మ్యాచ్ వీఆర్‌సీ, గౌతమి కళాశాల మధ్య జరిగింది.వీఆర్‌సీ పది ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 60 పరుగులు చేయగా గౌతమి కళాశాల జట్టు 9.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది.

భారీ విజయం అందుకున్న క్షత్రియ

మూడో మ్యాచ్‌లో క్షత్రియ కాలేజీ, కామారెడ్డి ఎస్ఆర్‌కే జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న క్షత్రియ జట్టు 10 ఓవర్లలో 116 పరుగులు చేసింది. ఇందులో సచిన్ 25 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్‌కే జట్టు నిర్ణిత ఓవర్లలో 71 పరుగులు మాత్రమే చేసింది. క్షత్రియ బౌలర్ సచిన్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

'నిశిత' భారీ స్కోర్

నాలుగో మ్యాచ్‌లో నిశిత కాలేజీ, వీఆర్ఈసీ మధ్య జరిగింది. ఇందులో టాస్ గెలిచిన నిశిత జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. చరణ్ 72 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వీఆర్ఈసీ 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసింది. అభిజిత్ 45 రన్స్‌తో రాణించిన ఫలితం లేకుండా పోయింది.

నేడు సెమీస్

సీనియర్ విభాగంలో సాందీపని, గౌతమి కళాశాల మధ్య మొదటి సైమీ ఫైనల్ జరగనుంది. రెండో మ్యాచ్ క్షత్రియ కాలేజీ, నిశిత కళాశాల మధ్య ఉంటుంది. జూనియర్ విభాగంలో ఫైనల్ మ్యాచ్ నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్ఆర్ కళాశాలల మధ్య ఉంటుంది.

సెమీస్‌లో రాణిస్తా



నేను చేసిన 72 పరుగులు జట్టు విజయానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇదే స్ఫూర్తితో సెమీస్‌లో రాణించి మా జట్టును విజేతగా నిలుపుతాను.

– చరణ్, నిశిత కళాశాల

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP
SPL SAKSHI PREMIER LEAGUE
SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional sponsor

అధికార పార్టీ తొత్తులుగా పోలీసులు



జిల్లా కోర్టులో మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ తదితరులు

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: పోలీసులు అధికార పార్టీ నాయకుల తొత్తులుగా మారి కాంగ్రెస్ నాయకులను అరెస్టులు చేయటం సరికాదని పీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి పి సుదర్శన్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్ గడుగు రోహిత్‌ను అరెస్టు చేసి సారంగపూర్ జైలుకు పంపగా, సోమవారం రోహిత్‌ను సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ విప్ అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. కార్పొరేటర్ గడుగు రోహిత్ మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయటం మంచిదికాదన్నారు. వెంటనే రోహిత్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ నాయకులు అనుకుంటే టీఆర్ఎస్ వాళ్లు రోడ్లపై తిరిగేవారు కాదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లను రోడ్లపై కొడుతు జైల్లో పెట్టె సమయం ఆసన్నమైందని, అక్రమ అరెస్టులకు కాంగ్రెస్ నాయకులు ఎవరు భయపడవద్దన్నారు. త్వరలోనే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో మాట్లాడి జైల్ బరో కార్యక్రమానికి పిలుపునిస్తామన్నారు. మాజీ విప్ ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులపై అక్రమంగా కేసులు పెడితే చూస్తు ఊరుకోమన్నారు. నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కామారెడ్డి అధ్యక్షుడు కైలాష్ శ్రీనివాస్, కేశ వేణు, తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి ఉన్నారు.

క్రైం కార్నర్

మద్యం తాగించి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నస్రుల్లాబాద్: మండలంలోని అంకోల్ తండా శివారులో అంకోల్ గ్రామానికి చెందిన నీరడి శ్రీనివాస్(40) దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మద్యం తాగిన తర్వాత సీసాను నోట్లో దూర్చి పగులకొట్టి చంపారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శ్రీనివాస్ ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన మరో ఇద్దరితో మద్యం తాగినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. డాగ్ స్క్వాడ్ అనుమానితుల్లో ఒకరి ఇంటికి వెళ్లి ఆగింది. శ్రీనివాస్‌కు భార్య సావిత్రి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు.

వివాహేతర సంబంధమే కారణమా!

మృతుడి సోదరుడు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ భార్య సావిత్రికి తన ఇంటిక పక్కనే ఉన్న మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. దీంతో శ్రీనివాస్ సదరు వ్యక్తితో తరుచు గొడవ పడేవాడు. నెల రోజుల క్రిత్రం భార్య కూడా శ్రీనివాస్‌తో గొడవ పడి తల్లిగారింటికి పిల్లలతో వెళ్లింది. దీంతో వివాహేతర సంబంధమే హత్యకు కారణం అయి ఉంటుందని గ్రామస్తులు అనుకుంటున్నారు. అనుమానితులు గతంలో శ్రీనివాస్‌కు డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. డబ్బుల విషయంలో గొడవ జరిగి చంపేశారా తెలియాల్సి ఉంది. అలాగే శ్రీనివాస్‌కు పలువురితో గ్రామంలో వ్యవసాయ భూమి విషయంలో గొడవలు ఉన్నట్లు సమాచారం. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



నీరడి శ్రీనివాస్(ఫైల్)

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి పదేళ్ల జైలు

ఖలీల్‌వాడి: పదేళ్ల బాలిక చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించిన సూత్రాల ఆనంద్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తు నిజామాబాద్ ఫోక్సో కోర్టు (అదనపు జిల్లా సెషన్స్ కోర్టు) న్యాయమూర్తి శ్రీనివాసరావు సోమవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసికూటర్ రవిరాజ్ తెలిపిన వివరాలు... నిర్మల్ జిల్లా కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన ఒక కుటుంబం బతుకు దెరువు కోసం మోర్తాడ్ మండలంలోని ఒక గ్రామంలో స్థిర పడింది. 2022 జనవరి 6న తల్లిదండ్రులు కూలీ పనికి పోయిన తర్వాత అదే గ్రామానికి చెందిన ఆనంద్ పదేళ్ల బాలికకు డబ్బులు ఇస్తానని చేయి పట్టుకుని ప్రైవేట్ పార్ట్స్ తాకాడనే అభియోగాలు నేర న్యాయ విచారణలో రుజువయ్యాయి. దీంతో సెక్షన్ 354 ప్రకారం ఐదేళ్లు, ఫోక్సో చట్ట ప్రకారం అదనంగా మరో ఐదేళ్ల జైలుశిక్ష తో పాటు రూ.5 వేల జరిమాన విధించారు. జరిమానా చెల్లించక పోతే మరో ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు పీపీ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన కులకర్ణి కల్యాణి(32) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఐదో టౌన్ ఠాణా ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు.. కాలనీకి చెందిన దిలీప్‌తో 2018లో కల్యాణికి వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కల్యాణి ప్రైవేట్ బ్యాంకులో స్వీపర్‌గా పని చేస్తుంది. ఈ మధ్య ఆమె ఆర్థిక పరిస్థితి బాగ లేదని బాధ పడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అసద్ బాబానగర్‌లో ఒకరి హత్య

ఖలీల్‌వాడి: నగరంలోని అసద్‌బాబానగర్‌లో ఆదివారం రాత్రి ఒకరు హత్యకు గురయ్యారు. అసద్ బాబానగర్‌లోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న అహ్మద్ ఖాన్ (52)ని అదే ఆపార్ట్‌మెంట్‌లో ఉంటున్న పాషా కత్తితో పొడవడంతో చనిపోయాడు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న డ్రెయినేజీ పొడవడంతో దానిని అహ్మద్ ఖాన్, మునీర్ మరమ్మతు చేయిస్తున్నారు. ఆ సమయంలో వీరిద్దరితో పాషా గొడవకు దిగారు. దీంతో పాషాను అహ్మద్ ఖాన్ కొట్టాడు. పాషా స్థానికంగా ఉండే తన స్నేహితుడైన అక్తర్‌ను రప్పించాడు. అనంతరం పాషా తన ఇంట్లో నుంచి కత్తిని తీసుకొచ్చి అహ్మద్ ఖాన్‌ను పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అహ్మద్‌ఖాన్ అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి మృతి!

ఖలీల్‌వాడి: నగరంలోని కోజా కాలనీలో సెప్టిక్ ట్యాంక్ క్లినింగ్ చేయడానికి వచ్చి అందులో పడి ఒకరు మృతి చెందినట్లు తెలిసింది. నగరంలోని నెహ్రూనగర్ వద్ద ఉన్న అడ్డా నుంచి కూలీని ఇంటి ఓనర్ తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆయన సెప్టిక్ ట్యాంక్ వద్ద పని చేస్తున్న సమయంలో ఫిట్స్ వచ్చి పడిపోయినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబును వివరణ కోరగా అడ్డా కూలీ సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయడానికి వెళ్లి, అక్కడ ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి వివరాల కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

లెక్చరర్‌పై కేసు నమోదు

సదాశివనగర్: సదాశివనగర్‌లోని మోడల్ కళాశాలలో (పీజీటీ)బోటని లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేశ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ సోమవారం తెలిపారు. నరేశ్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థి సంఘాలు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బెయిల్ మంజూరు

మోపాల్: మంచిప్ప ముంపు నిర్వాసితుల కమిటీ సభ్యులపై నమోదైన హత్యాయత్నం కేసులో రిమాండ్ అయిన శ్రీనివాస్‌యాదవ్, శంకర్‌కు సోమవారం బెయిల్ మంజూరు అయింది. గడ్కోల్ పంప్‌హౌస్ పనులు అడ్డుకునే క్రమంలో పోలీసులు, అధికారులు, నిర్వాసితుల మధ్య గత మేలో తోపులాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధికారుల ఫిర్యాదు మేరకు 15 మందిపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఈ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇద్దరికి బెయిల్ మంజూరు కాగా కేసులో ఉన్న మిగతా వారికి నేడు, రేపు ముందస్తు బెయిల్ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. బెయిల్ మంజూరు అయిన వారు మంగళవారం విడుదల కానున్నట్లు సమాచారం.

ఒకరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కామారెడ్డి క్రైం: ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రామారెడ్డికి చెందిన అసాద్ అలీ కామారెడ్డిలోని అశోక్‌నగర్ కాలనీలో చికెన్ సెంటర్ నడిపిస్తుంటాడు. ఆదివారం రాత్రి ఆయన జయశంకర్ కాలనీ వద్ద బైక్‌పై వెళ్తుండగా మరో బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దాడి చేసినట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి అతడిని ఆస్పత్రికి తరలించారు. సోషల్ మీడియాలో ఈ ఘటనలో అసద్‌అలీపై కత్తిపోట్ల దాడి జరిగినట్లుగా ప్రచారం జరిగింది. అసద్ అలీ కడుపు భాగంలో ఓ చిన్న గాయం ఉందని పోలీసులు తెలిపారు. కానీ కత్తిపోట్ల దాడి కాదన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చినట్లు అసద్‌అలీ ఫిర్యాదు చేశాడని పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

DOCUMENT MISSING

■ గుత్పె రాజేంధర్, S/o. గుత్పె మల్లయ్య R/o. NZB. నేను Gas Godown (PS-V) నుండి వర్ని చౌరస్తాకు వెళ్ళుటప్పుడు 6134/2016 నెం॥ గల ఇంటి డాక్యుమెంట్ పోయినది. దొరికినచో సంప్ర: 9440932006. [Z-772150]

WANTED

■ Wanted Teachers & Helping Teachers for all subjects to Teach Nursery to VII English Medium in NZB. Cont: 9966962549, 7673957578 [Z-772143]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779863]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-10072]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఫిర్యాదులను పరిష్కరించాలి



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్
- ప్రజావాణికి 85 వినతులు



బారులు తీరిన ఫిర్యాదుదారులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 85 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 50 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా మున్సిపాలిటికి 10, డీఎంహెచ్‌వోకు 1, డీపీవోకు 9, ఎస్పీ ఆఫీస్‌కు 7 ఫిర్యాదులు వచ్చాయి. మిగితా ఫిర్యాదులు ఆయా శాఖలకు చెందినవి. అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. డీఆర్‌డీవో సాయన్న, ఏవో రవిందర్ పాల్గొన్నారు.

టీయూ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ ఆరతి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ గ్రౌండ్‌లో సోమవారం హ్యాండ్‌బాల్ మహిళల, పురుషుల జట్ల ఎంపికలను నిర్వహించినట్లు వర్సిటీ డైరెక్టర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డాక్టర్ సంపత్ తెలిపారు. వివిధ కళాశాలల నుంచి పురుషుల విభాగంలో 35 మంది, మహిళల విభాగంలో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన పురుషుల జట్టు ఫిబ్రవరి 4 నుండి 8 వరకు తమిళనాడులోని సేలంలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటుంది. మహిళ జట్టు ఫిబ్రవరి 15 నుండి 19 వరకు కేరళలోని కొట్టయమ్ మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటుంది. ప్రిన్సిపాల్ ఆరతి, ఫిజికల్ డైరెక్టర్ బాలమణి, స్వప్న, వర్షిని, వరలక్ష్మి, సౌమ్య, వర్సిటీ క్రీడావిభాగం సహాయ ఆచార్యులు డా.బి.ఆర్.నేత పాల్గొన్నారు.

సాధు సమ్మేళనం.. భక్తజన సందోహం



పాల్గొన్న భక్తులు

నందిపేట పలుగుట్ట శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో అఖిలాంధ్ర సాధుసంతుల పరిషత్ కొనసాగుతోంది. సోమవారం పూజలు, యాగాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



హోమం చేస్తున్న సాధువులు



ఆశ్రమ ఆవరణలో భక్తులు

విడాకుల పంచాయితీలో యువకుడి కిడ్నాప్



సతీష్

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన గొల్ల గుర్జుకింది సతీష్ అనే యువకుడు సిరికొండ అటవీ ప్రాంతంలో కిడ్నాప్‌కు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. గడ్కోల్‌కు చెందిన మల్లయ్య పెద్ద కుమారుడు సంజీవ్‌కు భీంగల్‌కు చెందిన దొడొల్ల మల్లేష్ పెద్ద కూతురుతో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య జరిగిన గొడవలతో కొన్ని నెలలుగా సంజీవ్ భార్య తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. విడాకుల పంచాయితీ నడుస్తున్నట్లు తెలిసింది. సంజీవ్ తమ్ముడు సతీష్ తన తండ్రితో కలిసి వేములవాడ వద్ద ఎనుగంటి గ్రామంలో గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. సంజీవ్ సోమవారం గొర్రెల వద్దకు వెళ్లగా సతీష్ గడ్కోల్ గ్రామానికి చెందిన కొండూర్ సాయన్న అనే వ్యక్తితో ద్విచక్రవాహనంపై ఎనుగంటి నుంచి గడ్కోల్‌కు వస్తున్నాడు. మార్గమధ్యలో సిరికొండ అటవీ ప్రాంతంలో మూడు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వీరిని చుట్టుముట్టారు. సతీష్‌ను, సాయన్నను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి వాదనకు దిగారు. సంజీవ్ మామ మల్లేష్ మరో ఐదుగురితో కలిసి సతీష్‌పై దాడికి దిగినట్లు సా యన్న తెలిపాడు. రెండు గంటల అనంతరం సాయన్నను అక్కడే వదిలేసి సతీష్‌ను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లిపోయారు. తన కూతురుకు విడాకులు ఇచ్చి త్వరగా పంచాయితీ మాట్లాడుకుంటేనే సతీష్‌ను విడిచిపెడతామని వారు చెప్పారని సాయన్న తెలిపారు. కిడ్నాప్ చేసిన వారు సతీష్‌తో కుటుంబ సభ్యులకు ఫోన్ చేయించారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవద్దని గతంలో విడాకుల పంచాయితీలో మాట్లాడిన విధంగా జరిమానా చెల్లిస్తే సతీష్‌ను వదిలేస్తామని చెప్పించారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. సతీష్ భార్య రుచిత ఫిర్యాదు మేరకు మల్లేష్‌తో పాటు మరో ఐదుగురిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. సీఐ సైదా, ఎస్సై సిబ్బందితో కలిసి సతీష్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కాగా నిందితుడి ఇంటికి తాళం ఉందని, ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తోందని పోలీసులు తెలిపారు. నిందితుడి భార్య, కూతురు వారి బంధువుల ఇంట్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించి, విచారిస్తున్నట్లు తెలిసింది.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన నగదు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధం అయింది. వివరాలు.. గ్రామానికి చెందిన పెద్ది నారాయణ, ఆయన భార్య గంగు సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ కూలీ పనులకు వెళ్లారు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు నారాయణకు సమాచారం అందించారు. ఇంటి తాళం పగుల గొట్టి లోనికి వెళ్లి మంటలను ఆర్పడానికి యత్నించారు. పెంకుటిళ్లు కావడంతో దూలాలకు నిప్పు అంటుకొని ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. ట్రంకు పెట్టెలో దాచుకున్న రూ.2.50 లక్షల నగదు కాలిపోయింది. ఇంట్లోని సామగ్రి, నిత్యావసర వస్తువులు బట్టలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. పదేళ్లుగా కాయకష్టం చేసుకొని సంపాదించి దాచుకున్న లక్షల రూపాయలు కాలిపోయాయని బాధితులు రోధించారు. ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి పంచనామా చేశారు. రూ.ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

కుక్కల దాడిలో 33 గొర్రెలు మృతి

రామారెడ్డి: రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామంలో ఆదివారం రాత్రి కుక్కల దాడిలో 33 గొర్రెలు మృతి చెందాయి. మూడు గొర్రెలు గాయపడ్డాయి. సుమారు రూ.మూడు లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు బొల్లారపు నడిపి మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన స్థలాన్ని ఎంపీటీసీ రాజాగౌడ్, టీఆర్ఎస్ నాయకుడు ప్రభాకర్‌రావు సందర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు